



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

# వైభవంగా వరలక్ష్మీ వ్రతం



శ్రీశైల క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో, గృహాల వద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న చంద్రావతీ కల్యాణ మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఈ వ్రతానికి కావాల్సిన పూజా సామగ్రిని దేవస్థానం సమకూర్చింది. వ్రత కార్యక్రమంలో పాల్గొనే ప్రతి భక్తురాలికి వేర్వేరుగా కలశాలను నెలకొల్పి శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గణపతి పూజతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వరలక్ష్మీ వ్రతంలో భాగంగా భక్తులందరితో కలశ స్థాపన చేయించి వరలక్ష్మీదేవి అమ్మవారిని ఆవాహన చేసి, శ్రీసూక్త విధానంలో వ్రతకల్ప పూర్వకంగా అమ్మవారికి పూజలు జరిపించారు. భక్తులకు వేదపండితులు అమ్మవారి వ్రత విశేషాలను తెలియజేశారు. వ్రతంలో పాల్గొన్న మహిళలందరికీ చీర, రవిక వస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, వృక్ష ప్రసాదంగా తులసి, ఉసిరి మొక్కలను, శ్రీశైలప్రభ మాసపత్రిక, ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం, అన్నపూర్ణ భవనంలో భక్తులందరికీ అన్నప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.



శ్రీశైల క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

# ప్రకృతితో అనుబంధం





**నల్లమల అంటేనే ఆదివాసీ మూలాలు ఇంకా మిగిలివున్న చెంచు అరణ్య ప్రాంతం. ఆఫ్రికా ఖండంలో మొట్టమొదటి సారిగా ఉదయించిన మానవ జాతి జీవ పరిమాణ క్రమంలో నదులు, సముద్రాలు, అడవులు దాటుతూ ఆసియా ఖండంలో ప్రవేశించి అక్కడి నాగరికత వైపు ప్రయాణించారు. ఆదివాసీ మూల సంతతి అయిన నల్లమల చెంచుల్లో ఇప్పటికి ఆజాతి సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో మార్పు లేకపోయినప్పటికి ఆదివాసీ అసలైన వారసులుగా చరిత్రలో మిగిలిపోయారు. మానవుడి జీవన పరిణామ క్రమం ఆదివాసి గిరిజన తెగ నుంచే ఆరంభమైందన్న వాస్తవ చరిత్ర ఉన్నప్పటికీ ఆదిమ గిరిజన జాతులపై పాలకులకు చిత్తశుద్ధి సన్నగిల్లుతోంది. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.**

- నానాటికీ అంతరించిపోతున్న గిరిజన సంతతి
- కాగితాలకే పరిమితమైన సంక్షేమం
- ఐటీడీఏలకు నిధులపై స్పష్టత లేదన్న విమర్శలు
- నేటికీ అందని వైద్య సదుపాయాలు
- అడవి నుంచి బయటకు పంపేందుకు ప్రయత్నాలు
- ఆధునిక పోకడలతో సంస్కృతిని కాలరాస్తున్న వైనం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఆత్మకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతితో గిరిజనుల అనుబంధం వెలకట్టలేనిది. ప్రకృతిలో మమేకమై జీవనం సాగిస్తుంటారు. ప్రపంచంలోనే అతి త్వరగా అంతరించిపోతున్న ఆదివాసీ చెంచు తెగ ఈ నల్లమలలోనే ఇంకా ఊపిరిపీల్చుకుంటూ మనుగడ సాగిస్తోంది. నానాటికీ గిరిజన సంతతి తగ్గుతున్నప్పటికీ గిరిపుత్రుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. గిరిజన సంక్షేమం కోసం కేటాయించిన నిధులు దారిమళ్లితున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అనేక ఆదివాసీ తెగలు ఉన్నప్పటికీ మనదేశంలోని నల్లమల అడవుల్లో ఆదివాసీ చెంచు గిరిజన తెగమూలాలు ఇంకా మిగిలి ఉన్నాయి. ప్రకృతితో మమేకమై వైవిధ్యమైన జీవనాన్ని నల్లమలలోని పలు గూడేంల గిరిజనులు సాగిస్తున్నారు.



పెంపుడు జంతులతోనే చెంచుల జీవనం

## 1982లో కమిషన్ ఏర్పాటు..

ఆదివాసీ గిరిజన సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 1982లో తొలిసారిగా ఐక్యరాజ్య సమితి(ఐరాస) నడుంబిగించి ఓ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. గిరిజన జాతులను సంరక్షించాలన్న నేపథ్యంలో వివిధ దేశాల ప్రతినిధులతో చర్చలు సాగించి 1996 ఆగస్టు 9న ఆదివాసీ గిరిజన హక్కుపై ఐరాస కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందుకు ఐరాస సభ్యత్వం వున్న సుమారు 80శాతం దేశాల ప్రతినిధులు ఆమోదం వ్యక్తం చేయడం గమనార్హం. ప్రతిదేశంలో కొత్త సవరణలతో ఆదివాసీ గిరిజనులకు ప్రత్యేక ప్రతిపత్తి హోదా కల్పించారు. మనదేశ రాజ్యాంగంలో 5షెడ్యూల్‌లో 244(1) ఆర్టికల్, 6వ షెడ్యూల్డ్‌లో 244(2) ఆర్టికల్‌ను రూపొందించి వాటికి సంబంధించిన విశేష, విశిష్ట అధికారులను ఆయా రాష్ట్రాల గవర్నర్లకు కల్పించింది. అలాగే రాష్ట్రాల శాసనసభలతో కూడా సంబంధం లేకుండా ఏకపక్ష తీర్మానం చేసే అధికారాన్ని సైతం గవర్నర్లకు రాజ్యాంగం అవకాశం కల్పించింది. ఈ విషయంలో ఇప్పటి వరకు నల్లమల గిరిజనుల సంక్షేమానికి ఏ ఒక్క గవర్నర్ చొరవ తీసుకోకపోవడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి సూచన మేరకు 1982లోనే మన దేశంలోని శ్రీశైలం ఐటీడీఏ ఆవిర్భవించినప్పటికీ చెంచుల జీవన ప్రమాణాలు ఏమాత్రం మెరుగుపడలేదు. అసలు ఐటీడీఏలకు కేటాయించిన నిధులు ఏవిధంగా ఖర్చుచేస్తున్నారో కూడా స్పష్టత లేదన్న విమర్శలు ఉన్నాయి.

## 10వేల జనాభా ఉంటుందని..

నల్లమల గిరిజనుల్లో పోషకాహారలోపం, రక్తహీనత, క్షయ వ్యాధి, శిశుమరణాలు సంభవించడంతో చెంచుల సంతతి క్షీణించిపోతోంది. నంద్యాల జిల్లా పరిధిలో 14 మండలాల్లో 48 చెంచుగూడేలు ఉన్నాయి. వాటిలో సుమారు 2951 గిరిజన కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 10వేల గిరిజన జనాభా ఉంటుందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వీటికి కేవలం 12 చెంచుగూడేలకు మాత్రమే పూర్తిస్థాయిలో ఆరోగ్య సదుపాయం కల్పిస్తుండగా మిగతా గూడేలకు అంతంతమాత్రంగానే ఆరోగ్య సేవలు అందుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన ఆసుపత్రులను ఏర్పాటు చేసినట్లు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. ప్రత్యేకించి గిరిజనులు రక్తహీనత టీబీ, కుష్టు, మలేరియా, సీజనల్ జ్వరాలు, చర్మవ్యాధులు వంటి రోగాలతో బాధపడుతున్నారు.

మిగతా 6వ పేజీలో



ఆటవిడుపుగా బారకట్ట ఆడుతున్న చెంచులు

# మంట పుట్టిస్తున్న మిర్చి

- కిలో రూ.80 నుంచి రూ.100
- ఆవేదనలో వినియోగదారులు



కొలిమిగుండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పచ్చి మిర్చి తినకుండానే మంట పుట్టిస్తోంది. ధరను చూసే వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. నిన్న మొన్నటి వరకు కిలో రూ.10, 20 పలికిన పచ్చిమిర్చి ఒక్కసారిగా ఘాటెక్కింది. రిటైల్ మార్కెట్లో కొద్దిరోజులుగా ఏకంగా రూ.80కి పైగా చేరడంతో వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. రెండు వారాల వ్యవధిలోనే పచ్చిమిర్చి ధర ఆకాశానికి చేరిందని వినియోగదారులు వాపోతున్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజల వంటింట్లో ప్రధాన అవసరమైన పచ్చిమిర్చి ధరలు పెరగడంపై ఆయా వర్గాల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. వర్షాభావ పరిస్థితులు, దిగుబడి తగ్గడం తదితర కారణాలతో పచ్చిమిర్చి ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని కొంతమేర దిగుబడి సాధించిన రైతులకు ఈధరలు సంతోషం కలిగిస్తున్నాయి. ప్రస్తుతం కొన్ని చోట్ల రూ.100వరకు పచ్చి మిర్చిని విక్రయిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

# దద్దనాల ప్రాజెక్టుకు నీరు

- 15 రోజులుగా ఎత్తిపోతల పథకం ద్వారా నిరంతరం పంపింగ్
- మోటార్ల మరమ్మతులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సహకారం



దద్దనాల ప్రాజెక్టుకు చేరుతున్న నీరు

బనగానపల్లె, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా గత 15 రోజులుగా నిరంతరం నీటి పంపింగ్ జరుగుతోంది. ఎస్సార్బీసీ కాలువ నుంచి నాలుగు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో 5ఏళ్లు దద్దనాల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపింగ్ చేయకపోవడంతో నాలుగు మోటార్లు తుప్పుపట్టాయి. తిరిగి రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వీటికి ప్రాణం పోశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల స్థితిగతులను గమనించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సొంత నిధులు రూ.25.75 లక్షలు వెచ్చించి తుప్పుపట్టిన మోటార్లకు మరమ్మతులు చేయించి ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయించారు. దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేయడంతో దద్దనాల ప్రాజెక్టుకు నీరు చేరుతున్నాయి. దద్దనాల ప్రాజెక్టు తూములను ఎత్తడంతో పంట కాలువల ద్వారా ప్రాజెక్టు పరిధిలోని రైతులు పంటలు పండించుకుంటున్నారు. రైతులు ఆ నీటితో పంటలకు మొక్కజొన్న తదితర పంటలు వేసిన రైతులు నీటి తడులు కట్టుకుంటున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ఇబ్బందులు కలగకుండా మంత్రి ముందు చూపుతో ఎత్తిపోతల పథకానికి బనగానపల్లె సమీపంలోని ఎస్సార్బీసీ ఎత్తిపోతల పథకాన్ని ఏడేళ్ల క్రితం రూ.21 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించి బనగానపల్లె పట్టణంలోని ఎస్సార్బీసీ కాలువ నుంచి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించారు. సుమారు 17 కిలో మీటర్ల వరకు పైపులైన్ వేయించారు. కోయా కంపెనీకి కాంట్రాక్టు అప్పగించి పనులు పూర్తి చేసి దద్దనాల ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయించి దద్దనాల ప్రాజెక్టుకు బీసీ జనార్దన్‌రెడ్డి నీరందించారు. దద్దనాల ఎత్తిపోతల ద్వారా నీరు అందుతుండడంతో ఈప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయడంతో భూగర్భజలాలు కూడా పెరిగిపోయాయి. బోర్లలో నీరు పెరిగాయి. అలాగే ఈప్రాంతంలోని 20 గ్రామాల ప్రజలు తాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టు ఆదుకుంటోంది.

# అమృతవల్లి అమ్మవారికి తిరుమంజనం



అమృతవల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కిడాంబి వేణుగోపాల స్వామి

ఆళ్లగడ్డ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన అహోబిల క్షేత్రంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలో అమృతవల్లి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో నవ కలశ పంచామృత తిరుమం జనం నిర్వహించారు. సాయంత్రం అమృత వల్లి అమ్మవారికి దేవస్థానం ప్రాంగణంలో పల్లకీ ఉత్సవం, అమ్మవారికి విశేష ఊంజల్ సేవ నిర్వహించి వచ్చిన మహిళలకు గాజులు, కుంకుమ తీర్థ ప్రసాదాలు ఇచ్చారు. మనియర్ సౌమ్య నారాయణ్ స్వామి, అర్చకులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై వైసీపీ క్రూరత్వం

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు 7

రక్షాబంధం 6

## అంగరంగ వైభవంగా..

# సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

- రాఘవేంద్రస్వామి మఠంలో ధ్వజారోహణతో మొదలైన వేడుకలు
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన ప్రహ్లాదరాయలు
- ధాన్య పూజ చేసిన పీఠాధిపతి
- అలరించిన కూచిపూడి నృత్యం



ధ్వజారోహణతో ఉత్సవాలకు నాంది పలుకుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. రాత్రి మహాముఖద్వారంపై ధ్వజారోహణలో భాగంగా జెండాను ఆవిష్కరించి 354వ ఉత్సవాలకు నాంది పలికారు. యోగీంద్ర కళామండపంలో జ్యోతి ప్రజ్వలన చేసి పీఠాధిపతి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు గోపూజ, అశ్వపూజ, లక్ష్మీపూజ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఏఏవో, మేనేజర్లు, క్యాష్ సెక్షన్, ఇంజనీర్ సెక్షన్, వీఆర్వో, పీఆర్వో సెక్షన్ కార్యాలయాలకు ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చి అక్కడ ఉన్న అధికారులను పీఠాధిపతి ఆశీర్వదించారు. అనంతరం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను ఊంజల మండపంలో ఊయలలో ఏర్పాటు చేసి ఊరేగించి ధాన్యపూజ చేశారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను చెక్క, వెండి, రజత గజవాహనం, బంగారు, నవరత్నాల రథంపై ఊరేగించిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి మొదటి రోజు ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, ఈఈ సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సీఆర్వోలు విజయేంద్రాచార్, బద్రీనాథ్, అనంతపురాణిక్, రవికులకర్ణి, జేపీ స్వామి, జయతీర్థాచార్, ఏఈ బద్రీనాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ భక్తులు, మఠం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అలరించిన కూచిపూడి నృత్యం

ఆరాధనోత్సవాల్లో మొదటి రోజు శుక్రవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో మాలూరుకు చెందిన విద్వాన్ ప్రసన్న కోర్పితో దాసవాని సాహిత్యం, ధర్మవరానికి చెందిన లలిత కళానికేతన్ నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. అనంతరం కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



ధాన్యపూజ చేస్తున్న పీఠాధిపతి

మిగతా 7వ పేజీలో

# పుస్తకం.. జ్ఞాన భాండాగారం

- మంచి పుస్తకం జీవితానికి మార్గదర్శకం
- గ్రంథాలయాలకే పరిమితమవుతున్న మంచి పుస్తకాలు
- తగ్గిపోతున్న పుస్తక పఠనాభిలాష
- నేడు జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం



కర్నూలు కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): 'అక్షర రూపం దాల్చిన ఒక్క సిరాచుక్క.. లక్ష మెదళ్లకు కదలిక..!' అంటారు ప్రముఖ కవి, దివంగత కాళోజీ నారాయణ రావు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుస్తకాలు చదివి అపారమైన విజ్ఞానాన్ని సొంతం చేసుకున్నారు. గ్రంథ పఠనానికే అగ్ర తాంబూలం ఇచ్చి, భోజనం చేయడం మర్చిపోయిన సందర్భాలెన్నో తన జీవితంలో ఉన్నాయని ఆయనే పలుసందర్భాల్లో చెప్పుకొచ్చారు. ఒకప్పుడు 'పుస్తకం హస్తభూషణం' అని చేతిలో పుస్తకంతో ప్రతి ఒక్కరూ కనిపించేవారు. ఈ పుస్తకం చదివావా? అంటూ వాకబు చేసి ఆ పుస్తకాలు కొని చదివించే వారు. ఇళ్లలోనూ మంచి పుస్తకాలు అందుబాటులో ఉండేవి. కానీ మారుతున్న కాలంలో పుస్తక పఠనాభిలాషే తగ్గిపోతోంది. మంచి పుస్తకాలన్నీ గ్రంథాలయాలకే పరిమితమవుతున్నాయి. ఒకప్పుడు కాలక్షేపానికే కాదు, మంచి విజ్ఞాన సముపార్జనరకు ఉపయోగపడిన పుస్తకాలు నేడు సెల్‌ఫోన్ల ప్రభావంతో మరుగున పడిపోతున్నాయి. విద్యార్థులు, యువత కేవలం మార్కుల కోసమే, ర్యాంకుల కోసమే పాఠ్యపుస్తకాల వరకే పరిమితం అవుతున్నారని సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### గ్రంథాలయాలకు వెళ్లి..

నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి కనీసం ఒక గంట చదవడంతో మంచి ప్రయోజనాలు కలుగుతాయని సాహితీవేత్తలు చెబుతున్నారు. నిద్రలేమి సమస్యతో కొట్టుమిట్టాడే నేటి తరుణంలో పుస్తక పఠన ఆవశ్యకతను గుర్తుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు చెబుతున్నారు. పుస్తకం చదువుతూ నిద్రాదేవి ఒడిలోకి ఒరిగిపోయే సౌఖ్యాన్ని నేటి యువత గుర్తించకపోవడం శోచనీయమని పెద్దలు చెబుతున్నారు.

### సృజనాత్మకతను వెలికితీసే శక్తి..



మనుషుల్లో సృజనాత్మకతను వెలికితీసే శక్తి పుస్తకాలకు ఉంది. చదువుతున్నంత సేపూ మరో ప్రపంచంలోకి తీసుకువెళ్లి మానసిక ఒత్తిడిని తగ్గించగల దివ్య ఔషధం పుస్తకమే. వినోద, విజ్ఞానాలను పంచడమే కాకుండా, విస్తృత సమాచారాన్ని అందించే సాధనాలు పుస్తకాలు.

● డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, కవయిత్రి, కర్నూలు

### విజ్ఞాన వెలుగులు నింపే దివ్వెలు



పుస్తకాలు మన అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞాన వెలుగులు నింపే దివ్వెలు. ఎందరో మేధావుల అనుభవాలు, జ్ఞాన సంపద పుస్తకాల్లో అక్షర రూపంలో నిక్షిప్తమై ఉంటుంది. చరిత్రను పుస్తకాల ద్వారానే ఎలా తెలుసుకుంటామో, విజ్ఞాన సంబంధ అంశాలను పుస్తకాల ద్వారానే తెలుసుకుంటాం.

● జి. విజయసారథి, హెచ్ఎం జడ్పీహెచ్ఎస్, గూడూరు

# రక్షాబంధం

- అనుబంధానికి ప్రతీక..
- ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు
- మార్కెట్లలో సందడే సందడి
- నేడు రాఖీ పౌర్ణమి





అనుబంధానికి ప్రతీక.. ఆత్మీయత, అనురాగాలకు చిహ్నం రక్షాబంధన్.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాఖీ పౌర్ణమి సందడి నెలకొంది. శ్రావణ మాసం అంటేనే పర్వదినాల సమాహారం.. అందునా శ్రావణ మాసం వచ్చిందంటే చాలు వెల్లివిరిసే భక్తి భావంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపిస్తుంది. ఈమాసంలో వచ్చే శ్రావణ పౌర్ణమికు ఎంతో ప్రత్యేకత ఉంది. పౌర్ణమి చంద్రుడివలే అందరి జీవితాలు నిండుగా శోభించాలని.. సుఖ సంతోషాలతో వెల్లివిరియాలని కోరుకుంటూ ఇతరులకు రాఖీ కట్టడం ఆనవాయితీ. కనుకనే ఇది రాఖీ పౌర్ణమిగా ప్రసిద్ధి చెందింది. రాఖీ అంటేనే ఠక్కున గుర్తొచ్చేది అక్కా చెల్లెళ్లు, అన్న తమ్ముళ్లు బాగుండాలని రాఖీలు కట్టడం, తియ్యని మధురమైన బహుమతులు పొందడం ఇలా అనాదిగా వస్తున్న సంప్రదాయమే. ఇది ఈనాటిది కాదు సనాతనంగా వస్తున్న ఆచారమని పురాణాల్లో సైతం మనకు కనిపిస్తుంది. నేడు 'రాఖీ పౌర్ణమి' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు కల్చరల్/కొలిమిగుండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఏకైక వేడుక 'రక్షా బంధన్(రాఖీ). అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనురాగాల సన్నిధిగా నిలుస్తుంది ఈ వేడుక. శనివారం ఉమ్మడి జిల్లాలోని హైందవ కుటుంబాలు ఈ వేడుకను ఘనంగా నిర్వహించుకోనున్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు కట్టే రాఖీలు సిద్ధం చేసుకున్నారు. రక్షా బంధన్ ఉత్తరాది రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోనూ దశాబ్దాల కాలంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు, రాజస్థానీయులు, గుజరాతీయులు స్థిరవాసులుగా నివసిస్తున్నారు. ఈనేపథ్యంలో వేడుక సందడి బాగా కనిపించనుంది. మార్కెట్లో వేడుక సందర్భంగా విభిన్న రకాలు, డిజైన్లలో రక్షా బంధన్‌లు వ్యాపారులు అమ్మకాలకు పెట్టారు.

### శ్రావణ పౌర్ణమి సందడి...

ఏడాది పాటు వచ్చే ద్వాదశ పౌర్ణమిల్లో శ్రావణ పౌర్ణమికి ప్రత్యేకత ఉంది. ఈమాసంలో విచ్చేసే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి, శ్రావణ పూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ వంటి పేర్లతో పిలుచుకుంటారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, వ్రతాలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి షిరిడీ సాయిబాబా ఆలయాల్లో, పుట్టపర్తి సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈరోజున యజ్ఞోపవీతాలు (జంధ్యాలు) ధరించేవారు పాతది వదలి కొత్తది ధరిస్తారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా శైవ, వైష్ణవ ఆలయాల్లో దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరిస్తారు.

## సోదర బంధానికి ప్రతీక రాఖీ

● ఎంపీ బైరెడ్డి శబరి



కేంద్ర మంత్రికి రాఖీ కడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర బంధానికి ప్రతీక రాఖీ అని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎంపీల అల్పాహార విందులో పాల్గొన్న ఆమె పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్‌రిజీజుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రక్షాబంధన్‌తో ఒక గౌరవం, నమ్మకం అనే బంధానికి ప్రతీక అన్నారు.

### ఈఏడాది రాఖీ పౌర్ణమికి ప్రత్యేక విశిష్టత..

ఈఏడాది రాఖీ పౌర్ణమికి ప్రత్యేక విశిష్టత ఉన్నట్లు వేద పండితులు పేర్కొంటున్నారు. 1930 తర్వాత మళ్లీ ఈఏడాది రాఖీపౌర్ణమికు అంతటి ప్రాముఖ్యత ఉందని, అరుదైన మహా సంయోగం ఏర్పడే దినంగా పండితులు చెబుతున్నారు. ఈఏడాది రాఖీ పండుగ రోజు ఇతర శుభ యోగాలు కూడా ఉన్నాయని, లక్ష్మీనారాయణుడిని పూజించి, రాఖీ కడితే శుభ ఫలితాలు ఉంటాయని వేద పండితులు ఆలూరు రాఘవేంద్రప్రసాదు వెల్లడించారు.





### విక్రయాల సందడి..



రక్షాబంధన్ దినోత్సవం సందర్భంగా నగరంలో రాఖీల విక్రయాల సందడి బాగా కనిపించింది. శుక్రవారం రక్షాబంధనాల కోసం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విక్రయ కేంద్రాల్లో మహిళలు తమకు నచ్చిన రక్షాబంధనాల కొనుగోళ్లకు బారులు దీరారు. వ్యాపారులు విభిన్నరకాల రాఖీలను అందుబాటులో పెట్టారు. పూసలు, ముత్యాలు, విభిన్న రకాల అలంకరణ వస్తువులతో ఆకర్షణీయంగా రూపొందించిన రాఖీలను విక్రయాలకు పెట్టారు. రూ.20 నుంచి రూ.250 వరకు వివిధ ధరల్లో, విభిన్న రూపాల్లోని రాఖీలను ప్రజలు కొంటున్నారు.

## వైభవంగా వరలక్ష్మీ వ్రతం

- కామేశ్వరీదేవికి ప్రత్యేక అలంకరణ
- పాల్గొన్న వందలాది మంది మహిళలు





మహానందిలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

మహానంది, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మూడో శుక్రవారం పురస్కరించుకొని మహానంది క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రధాన ఆలయంలోని కామేశ్వరీదేవిని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అలంకరించారు. గణపతి పూజా, పుణ్యాహవాచనముతో పాటు సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని వందలాది మంది మహిళలతో వేదమంత్రాలతో జరిపారు. హాజరైన మహిళలకు దాతలు పసుపు కుంకుమలు అందజేశారు. రెండో ప్రాకారంలోని కోనేరులో వరలక్ష్మీ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మనకోసం.. మనమిత్ర

- 700 సేవలు ప్రజలకు అందుబాటులో
- ప్రజలకు మెరుగైన సేవల కోసం ప్రభుత్వం కృషి
- ఈనెల 15న ప్రారంభం
- ప్రభుత్వ వాట్సప్ నెంబర్: 9552300009

సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధే.. సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే మొదటిసారిగా 'మనమిత్ర' వాట్సప్ గవర్నెన్స్ అమలు చేయనుంది. సచివాలయాల పరిధిలో 26శాఖలకు సంబంధించి 700సేవలు ప్రజలు అందుకోవచ్చు. ప్రతిసేవ సకాలంలో పొందవచ్చు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. ప్రభుత్వం వాట్సప్ నెంబర్: 9552300009ను 'మనమిత్ర' కోసం కేటాయించింది. ఈసేవల గురించి సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించి పొందేలా చేయాలి. ఈనెల 15వ తేదీన 'మన మిత్ర'ను ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించనుంది.



రుద్రవరంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, విద్యార్థులు (ఫైల్)

రుద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే మొదటిసారిగా మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ఈ నెల 15న అమల్లోకి తెచ్చారు. 700 సేవలు ప్రజలకు అందుబాటులో రానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు సచివాలయాల నుంచి అందించేందుకు వాట్సప్ గవర్నెన్స్ అమలు చేసింది. హాయ్ అనండి.. హాయిగా సేవలు పొందండి, వాట్సప్ గవర్నెన్స్ నెంబరు 95523 00009 ఏర్పాటుచేసింది.

### సేవలు ఇలా..




సచివాలయాల పరిధిలో 26శాఖలకు సంబంధించి 700సేవలు ప్రజలు అందుకోవచ్చు. ప్రతి సేవ సకాలంలో పొందవచ్చు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ నిర్వహిస్తుంది. జిల్లాలో 409 గ్రామ సచివాలయాలు, 28 మండలాల్లో ఉన్నాయి. వార్డు సచివాలయాలు ఆరు మున్సిపాలిటీల్లో 107 ఉన్నాయి. వీటి పరిధిలో నివసిస్తున్న ప్రజలు మనమిత్ర, వాట్సప్ గవర్నెన్స్ ఉపయోగించి సేవలు పొందవచ్చు. ప్రతినెలా 5వ తేదీన వాట్సప్ గవర్నెన్స్ పైన గ్రామ ప్రజలతో కలుపుకుని సచివాలయ ఉద్యోగులు ర్యాలీ చేయాలి. ఈసేవల గురించి ప్రజలకు విస్తృతంగా సమాచారం అందించి పొందేలా చేయాలి.

### ఇలా ఉపయోగించండి

ప్రభుత్వం వాట్సప్ నెం.95523 00009ను మనమిత్ర పేరుతో సేవ్ చేసుకోండి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపి చాట్ చేయడం ప్రారంభించండి. మీకు కవాల్సిన సేవలు ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌లో లభ్యమై అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీరు ఒకసేవను ఎంపిక చేసుకోండి. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఎలక్ట్రిసిటీ బిల్ పేమెంటు.. కావాల్సిన వివరాలు పొందండి మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్‌బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్‌నెంబరు, మొబైల్ నెంబరు, లేదా సర్వీసు రిక్వెస్ట్ ఐడీలాంటివి. ఈ వివరాలు టెక్స్ రూపంలో లేదా వాయిస్ రూపంలో ఇవ్వండి. మీరు ఇచ్చిన వివరాలను ఒకసారి తనిఖీ చేసి తరువాత అందులో సిస్టం మీకు రియల్ టైం అప్‌డేట్స్ లేదా ఒక కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపు కోసం భద్రతతో కూడిన ఒక పేమెంటు లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోండి. వాట్సప్ గవర్నెన్స్‌లోని చాట్‌బాక్స్‌లో మీ ధ్రువీకరణ పత్రాలు, రశీదులు, లేదా అక్నాలెడ్జ్ మెంటు రూపొందించి మీకు అందిస్తుంది.

# ప్రకృతితో అను'బంధం'

5వ పేజీ తరువాయి



నల్లమల గిరిజన గూడేల్లో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయి. ఆత్మకూరు ప్రాంతం పరిధిలోని బైర్లూటి, శివపురం, కొట్టాలచెరువు, పాలెం చెరువు ప్రాంతాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయి. ప్రత్యేకించి వసతి గృహాలన్నింటిలో పర్యవేక్షణాధికారుల పనితీరుపై అనేక ఆరోపణలున్నాయి. గిరిజనుల కోసం వసతిగృహాలు, పాఠశాలల నిర్మాణానికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్న ప్రభుత్వం ఆ తర్వాత వాటి పర్యవేక్షణ గాలికి వదిలేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 2008 నుంచి 2014 వరకు 848 మంది గిరిజన బాల బాలికలు డ్రాపౌట్స్‌గా మిగిలిపోయారు. ఐటీడీఏ అధికారిక గణాంకాల్లో మాత్రం విద్యా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నట్లు రికార్డులు ఉండటం గమనార్హం.

### ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా..

నల్లమలలో నేటికీ అనేక గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా వాటికి చిల్లుపడుతున్నాయి. గిరిజనులకు భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణ చట్టాన్ని నిషేధించింది. వారికి కు.ని. ఆపరేషన్లు చేస్తే వారిపై శాఖపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు. అయితే ఆర్థిక ఇబ్బందులు, అవగాహన లోపంతో చెంచులు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నేటికీ చేయించుకుంటూనే ఉన్నారు.

- అటవీ శాఖ కూడా చెంచుల జీవన ప్రమాణాలను అడ్డుకునేందుకు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తుంది. పలు ప్రలోభాలకు గురిచేస్తూ అడవి నుంచి బయటకు పంపించేందుకు అన్నిరకాలుగా చర్యలు తీసుకుంటుంది.
- చెంచుల నృత్యాలు, ఆటపాటలు సాంప్రదాయబద్ధంగా ఉండేవి. అయితే ఆధునిక పోకడలతో వారి సంస్కృతిని కాలరాసేందుకు ప్రభుత్వ శాఖలే ముందుండి చొరవ తీసుకోవడం బాధాకరం. నల్లమల అంతర్భాగంలోని పెచ్చెర్వు చెంచుగూడేంలో మాత్రంలో నేటికీ గిరిజన ఆచారాలు అమలవుతున్నాయి. వీరిని కూడా అడవిలో నుంచి బయటకు తీసుకురావాలని అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ వారు అడవిని వదిలి బయటకు వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ఈఅంశంపై ఇటీవల కలెక్టర్ రాజకుమారిని కూడా చెంచులు సంప్రదించారు.

### గిరిజనుల అరణ్య రోదన..

ఐటీడీఏల ద్వారా నిధులను కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులు గిరిజనుల దరికి చేరడం లేదు. పలు గూడేంలకు రహదారి సదుపాయాలు లేకపోవడంతో పాటు మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కనీసం విద్యా, వైద్యం, ఉపాధి సౌకర్యాలు కూడా గిరిజనులు అరణ్య రోదనతో కాలం వెల్లదీస్తున్నారు.

### నంద్యాల జిల్లాలో గిరిజన వివరాలు పరిశీలిస్తే..

| | |
|---|---|
| చెంచుగూడేలు | : 48 |
| జనాభా | : సుమారు 10వేలు |
| కుటుంబాలు | : 2,951 |
| గిరిజన ఆశ్రమ పాఠశాలలు | : 20 |
| గిరిజన జూనియర్ కళాశాలలు | : 03 |



ప్రకృతిలోనే జీవన విధానాలు

## ప్రిన్సిపాల్‌కు మదర్ థెరిస్సా సేవా పురస్కార్



నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఇంటర్నేషనల్ మదర్ థెరిస్సా సేవా పురస్కార్‌కు ఎంపికయ్యారు. ఈ అవార్డును శుక్రవారం ఈమెయిల్ ద్వారా అందజేశారు. మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేందుకు గానూ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అత్యధికంగా అడ్మిషన్లుకు విశేషంగా కృషి చేసినందుకు గానూ ఈ అవార్డును మైక్స్ ఇంటర్నేషనల్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది ప్రిన్సిపాల్‌కు అభినందనలు తెలిపారు.

## శ్రీమఠానికి 1,001 బస్తాల బియ్యం

● రూ. 12 లక్షలు విరాళం



విరాళం ఇచ్చిన బియ్యం బస్తాలు

మంత్రాలయం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన సుగుణ బిల్డర్ అండ్ డెవలపర్స్ వారు 1001 బస్తాల (26 కేజీల బస్తాలు) బియ్యం విరాళంగా ఇచ్చారు. అదే విధంగా శ్రీమఠం ఆరాధనోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాలకు మంత్రాలయం కెనరా బ్యాంకు తరఫున మేనేజర్ నాగార్జున, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్ రూ.10లక్షల చెక్కు, ఆరాధనోత్సవాలకు కర్ణాటక బ్యాంకు తరఫున మేనేజర్ బీవీ కార్తీక్ రూ.2లక్షల డీడీని విరాళంగా ఇచ్చినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో స్టోర్ ఇన్‌చార్జిలు రవికులకర్ణి, అనంత రాఘవేంద్ర పురాణిక్, నారాయణరావు, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారిణి నృత్యప్రదర్శన

# అంగరంగ వైభవంగా.. సప్తరాత్రోత్సవాలు ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

**ఉత్సవాల్లో నేడు..**

ఆరాధన మహోత్సవాల్లో జరిగే రెండో రోజు శనివారం తెల్లవారుజాము 4 గంటల నుంచి 5గంటల వరకు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం, ఉదయం 6 నుంచి 8.15 గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, పంచామృతాభిషేకం, 8.15 నుంచి 8.30 గంటల వరకు గంటలకు టీటీడీ నుంచి పట్టువస్త్రాలు సమర్పణ ఉంటుంది. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అనంతరం యజుర్వేద నిత్య నూతన ఉపకర్మ పూజలు, 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ, మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహామంగళహారతి, తీర్థప్రసాదాలు, సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం, రాత్రి 8.30 గంటలకు రథోత్సవాలు, శాకోత్సవం, ఊంజల సేవ, రజిత మంటపోత్సవం నిర్వహించనున్నారు.

**నేటి సాంస్కృతిక కార్యక్రమాలు**

ఆరాధనలో రెండో రోజు శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు చెన్నై చెందిన విదీషి కన్యాకుమారిచే వాయిలీన్ వాయిద్యం, 6.30 నుంచి 8 గంటల వరకు పుత్తూరు చెందిన విద్వాన్ పుత్తూరు జగదీష్‌చే దాసవాని సాహిత్యం, ఉడిపికి చెందిన భార్గవి మృత్యతాండ వారిచే భరతనాట్యం నిర్వహించనున్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు



గోవులకు పూజలు చేస్తున్నపీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు



పూజలు చేస్తున్న పీఠాధిపతి, మఠం అధికారులు

## వ్యభిచార గృహంపై దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

**కర్నూలు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు చేశారు. సీఐ విక్రమసింహ ఆధ్వర్యంలో ఎస్ఐలు చంద్రశేఖర్ రెడ్డి, మోహనకిషోర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు చేసి 13 మందిని అరెస్టు చేశారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇందులో యువతుల నుంచి విటులను ఆకర్షిస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈదాడులు చేశారు. కల్లూరు, నందికొట్కూరు, శరీన్‌నగర్, బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురానికి చెందిన విటులతో పాటు కర్నూలు బాలాజీనగర్, సంతోష్‌నగర్, బనగానపల్లె, విజయవాడకు చెందిన మహిళలతో బాలాజీనగర్‌కు చెందిన ఆమె వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు తేలింది. వీరందరినీ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వ్యభిచార గృహాలు నిర్వహించేందుకు శివారు ప్రాంతంలో తాము కూడా ఓ ఫ్యామిలీ అంటూ అద్దెకు తీసుకుని ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి సెల్ ఫోన్లలో వాట్సప్ ద్వారా యువతుల ఫొటోలు పంపిస్తూ వారిని ఆకర్షిస్తూ ఈ వృత్తి నిర్వహిస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. వీరితో పాటు 8 మంది యువతులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి సొంతూర్లకు పంపించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఆదోని, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** ఇస్వీ-కుప్పగల్ రైల్వేస్టేషన్ల మధ్య రైలు ప్రమాదంలో 45ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే కానిస్టేబుల్ సాయిసర్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... ఇస్వీ-కుప్పగల్ రైల్వే స్టేషన్ల మధ్య కి.మీ. 507/23-25 మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. మృతుడి వద్ద మద్రాసు నుంచి ముంబై వరకు ప్రయాణించేందుకు టికెట్ కొనుగోలు చేసి జేబులో ఉంచుకున్నట్లు తెలిపారు. అతడిని గుర్తించేందుకు ఎలాంటి ఇతర ఆధారాలు లేవని, కుడిచేయి రెట్టపై ఆంజనేయస్వామి ట్యాటూ మార్క్ ఉందని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మద్యం డబ్బుల కోసం తల్లి హత్య



ఎల్లమ్మ(ఫైల్)

**కర్నూలు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మద్యం డబ్బుల కోసం తల్లిని హత్య చేసిన ఘటన కర్నూలు నగరంలోని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుధవారపేటలో జరిగింది. రుద్రాక్షల ఎల్లమ్మ (70) అనే వృద్ధురాలిని ఆమె కొడుకు జమ్మన్న హత్య చేశాడు. వివరాలివీ.. నంద్యాల చెందిన రుద్రాక్షల ఎల్లమ్మ, తన కొడుకు జమ్మన్న కర్నూలు బుధవారపేటలో నివాసం ఉంటున్నారు. జమ్మన్న వంట మాస్టరుగా పని చేస్తుంటాడు. ఇటీవల మద్యానికి బానిసై ఇంటి వద్దనే ఉంటూ నిత్యం తల్లిని హింసించేవాడు. శుక్రవారం తెల్లవారుజామున మద్యం కోసం డబ్బులు కావాలని తల్లితో గొడవ పడ్డాడు. మంచం మీద పడుకున్న ఆమెను నోరు, ముక్కు మూసి ఊపిరాడకుండా చేశాడు. తర్వాత చెవికి వున్న బంగారు కమ్మలు లాక్కెళ్లాడు. ఊపిరి ఆడక వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వృద్ధురాలి మృతదేహానికి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. జమ్మన్నపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేషయ్య తెలిపారు.

## ఎక్సైజ్ మెరుపు దాడులు



నిందితులతో ఎక్సైజ్ సిబ్బంది

**కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** చీప్ లిక్కర్ తయారీ కేంద్రంపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. శుక్రవారం రాత్రి ముందస్తుగా అందిన సమాచారం మేరకు కర్నూలు మండలం ఉల్చాల క్రాస్‌లో ఎక్సైజ్ శాఖ సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్ దాడులు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ కలాం నుంచి సేకరించిన వంద బండిల్స్, 10 వేల లిక్కర్ ఖాళీ సాచెట్లు, రెక్టిఫైడ్ స్పిరిట్, ఫుడ్ కలర్, అమృత్స్ సిల్వర్‌కప్స్ రేర్ ఇండియన్ బ్రాందీ, పది లీటర్ల సారాను కారులో తరలిస్తుండగా పింజరి మిన్నెల్లాను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కల్తీమద్యం తయారు చేయడం, అమ్మడం లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నట్లు గుర్తించారు. మిన్నెల్లాను అదుపులోకి తీసుకోగా హైదరాబాద్‌కు చెందిన అబ్దుల్ కలాం, కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన చంద్రబాబును అరెస్టు చేయాల్సి ఉందని ఎక్సైజ్ సీఐ చంద్రహాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు రెహనా, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

## ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోండి

**ఓర్వకల్లు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో మద్దిలేటి శుక్రవారం తెలిపారు. ఈవో మద్దిలేటి మాట్లాడుతూ విజయవాడ దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 7న నూతన ధర్మకర్తల మండలి దరఖాస్తుల కోసం ఆదేశాలు ఇచ్చారన్నారు. ఈనెల 8 నుంచి దేవస్థానాలకు నూతన ధర్మకర్తల మండలి నియా మకానికి 20 రోజుల్లోపు ఎవరైనా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారాలను కర్నూలు దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాల యంలో అందజేయాలని కోరారు.

# దళిత యువకుడిపై వైసీపీ క్రూరత్వం



మాట్లాడుతున్న కుడా చైర్మన్ సోమిశెట్టి

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** తిరుపతిలో దళిత యువకుడిపై భూమన కరుణాకరరెడ్డి అనుచరుడు, వైసీపీ నాయకుడి దాడి క్రూరమైందని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. డీసీఎంహెచ్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, బేతం కృష్ణుడు పాల్గొన్నారు. సోమిశెట్టి మాట్లాడుతూ దాడి చేసిన వైసీపీ రౌడీలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు తీవ్రంగా ఉండేవని, వాటన్నింటికి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఉన్న ద్వేషమే కారణమన్నారు. కేవలం ఓట్ల కోసం వారిని ఉపయోగించుకున్న జగన్, వారిపై దాడులను ప్రోత్సహించారన్నారు. తిరుపతిలో దళిత యువకుడిపై భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు, అనుచరుల దాడి క్షమించరానిదన్నారు.

**వైసీపీ దళిత వ్యతిరేకి : తిక్కారెడ్డి**



వైసీపీ నాయకులు అధికారంలో ఉన్నామనే భ్రమలోనే ఇంకా దాడులు చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదని మండిపడ్డారు. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులు దళిత యువకుడిపై జరిపిన దాడి సిగ్గుచేటన్నారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ అని చెప్పకనే వారి చేష్టలు రుజువు చేశాయన్నారు. అరాచక సంఘటనలను ప్రభుత్వం ఉపేక్షించబోదని, నిందితులకు కఠిన శిక్షపడాలని డిమాండ్ చేశారు.

**దళితులను టార్గెట్ చేసుకున్న వైసీపీ : బస్తిపాటి**



వైసీపీ మొదటి నుంచి దళితులను టార్గెట్ చేస్తూనే ఉందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు రాష్ట్రంలో అరాచకాలు సృష్టించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు నేటికీ అదే పంథాను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. గతంలో మాస్కులు అడిగిన పాపానికి దళిత వర్గానికి చెందిన డాక్టర్ సుధాకర్‌పై దాడిచేసి ఆయన చావుకు కారణమన్నారు. మరో దళిత డ్రైవర్‌ను హత మార్చి శవాన్ని డోర్ డెలివరీ చేశారన్నారు. తాజాగా బైక్ అద్దె చెల్లించలేదని పవన్‌కుమార్ అనే యువకుడిపై దాడికి పాల్పడడం దారుణమన్నారు.

# పోస్టుమార్టం చేయకుండా వైద్యుడి నిర్లక్ష్యం



ఆసుపత్రిలో వైద్యులతో బంధువుల వాగ్వాదం

- బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల ఆగ్రహం.. ఆసుపత్రి వద్ద బైఠాయింపు
- సీఐ, ఎస్ఐ జోక్యంతో పోస్టుమార్టం నిర్వహణ

**ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** పోస్టుమార్టం చేయకుండా వైద్యుడు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రి వద్ద బైఠాయించారు. వివరాలివీ.. తాడిపత్రికి చెందిన కత్తి మారెన్న గత 5 సంవత్సరాలుగా పట్టణంలోని ఎస్ఎంటీ కాలనీలో నివాసం ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. తాగుడుకు బానిసై ఈనెల 7న ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఆయనకు భార్య సుంకమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే శుక్రవారం ఉదయం మృతదేహం డికంపోజ్ అయిందని, తాను పోస్టుమార్టం చేయనని, కర్నూలు తీసుకెళ్లాలని వైద్యుడు మహబూబ్ బాషా చెప్పారు. దీంతో వైద్యుడి తీరుపై బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు మండిపడ్డారు. ఆసుపత్రి వద్ద బైఠాయించారు. దీంతో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి జోక్యం చేసుకొని ఇన్‌చార్జి డాక్టర్ సుజిత, వైద్యుడు మహబూబ్ బాషాతో మాట్లాడారు. చివరకు వైద్యుడు పోస్టుమార్టం చేయడానికి ఒప్పుకున్నారు. అయినప్పటికీ వైద్యుడు నిర్లక్ష్యంగా క్యాజువా లిటీలో కూర్చో వడం సమయాన్ని వృథా చేస్తుండడంతో బాధితులు కోపోద్రిక్తుల య్యారు. మృత దేహాన్ని తాడిపత్రికి తీసుకెళ్లాలని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ మండిపడ్డారు. దీంతో చివరకు వైద్యుడు మహబూబ్ బాషా మారెన్న మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

# నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు



నేత్రాలను ఐబ్యాంకు సిబ్బందికి అందజేస్తున్న నిర్వాహకులు

**నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** నేత్రదానంతో ఇరువురి జీవితాల్లో రెడ్‌క్రాస్ జిల్లా మాజీ వైస్ చైర్మన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ ఎండీ మారుతీకుమార్ తండ్రి రెంటాల లక్ష్మీనారాయణ వెలుగులు నింపారు. గురువారం ఆయన హార్ట్ ఎటాక్‌తో ఆకస్మికంగా మృతిచెందారు. రెడ్‌క్రాస్ ఆర్గాన్ డొనేషన్ మోటివేషన్ కోఆర్డినేటర్ ఆనంద్‌గురూజీ లక్ష్మీనారాయణ మృతి విషయాన్ని రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్ దస్తగిరి దృష్టికి తీసుకెళ్లారు.

ఆయన కర్నూలు రెడ్‌క్రాస్ ఐబ్యాంకు బృందానికి తెలియపర్చగా ఐబ్యాంకు సిబ్బంది శుక్రవారం ఉదయం లక్ష్మీనారాయణ రెండు నేత్రాలను సేకరించారు. ఈసందర్భంగా మారుతీకుమార్ మాట్లాడుతూ తన తండ్రి నేత్రాలు ఇంకా సమాజాన్ని చూడాలనే ఆలోచనతోపాటు మరో ఇద్దరి జీవితాలకు వెలుగును ప్రసాదించేందుకు నేత్రాలను దానం చేశామన్నారు. ఆనంద్‌గురూజీ మాట్లాడుతూ చనిపోయిన శరీరాన్ని వెంటనే ఫ్రీజర్‌లో ఉంచినట్లయితే దాదాపు 12గంటల వరకు నేత్రాలను సేకరించవచ్చునన్నారు. ఫ్రీజర్ అందుబాటులో లేకుంటే సిప్లాక్స్ ఐడ్రాప్స్ ప్రతి అరగంటకు ఒకసారి వేస్తూ ఉంటే ఆరు గంటలకు పైగా నేత్రాలను సేకరించవచ్చునని తెలిపారు.

# ఉరుకుంద ఆలయ ఈవో బదిలీ



ఎం.విజయరాజు

**కౌతాళం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజును బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గకపోవడంతో రాజకీయ నేతలు ఉన్నట్టుండి ఆలయ ఈవోను తమ పలుకుబడితో బదిలీ చేయించారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆలయంలో ప్రస్తుతం స్వామివారి శ్రావణ మాసపు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలు గతంలో ఎన్నడూ లేనివిధంగా భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ పాలన కొనసాగిస్తున్నాడు. అయితే ఇటీవల ఆలయ ఉప ప్రధాన అర్చకుడి మృతికి ఆలయ ఈవో వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడం కూడా ఈవో బదిలీకి కారణమై ఉండవచ్చు అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**విధుల్లో నిక్కచ్చిగా ఉండటం..**

విధులు చేపట్టిన అతి తక్కువ కాలంలోనే దేవాలయంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయంలో అర్చకులు స్వామి వారికి హారతులు ఇస్తూ హారతి పళ్లెంలో భక్తులు వేసే కానుకలను హుండీలో వేసేలా చర్యలు చేపట్టారు. అంతేకాక గర్భగుడిలో సీసీలు ఏర్పాటు చేసి పళ్లెంలోని కానుకలను హుండీలో వేయని అర్చకులకు కొందరికి నోటీసులు కూడా జారీచేసి అర్చకులకు కేటా యించిన విధులు వారు సక్రమంగా నిర్వర్తించేలా చేశారు. తలనీలాలు, కొబ్బరి కాయల టెండరుదారులు తమ అక్రమాలకు అడ్డు ఉన్నారన్న కోపంతో తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి తమకు అనుకూలమైన డీసీలను వేయించుకోవాలని పట్టుపట్టి ఈవోను బదిలీ చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

**కసాపురం ఆంజనేయస్వామి దేవాలయ..**

ఉరుకుంద ఆలయ ఈవో విజయరాజును అనంతపురం జిల్లా కసాపురం అంజనేయ స్వామి దేవాలయ డీసీగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఈవో వాణిని ఈరన్న స్వామి దేవాలయ ఈవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రావణ మాసపు ఉత్సవాల పూర్తి అయ్యేంత వరకు ఈఓ విజయరాజు బదిలీని ఆపాలంటూ భక్తులు కోరుతున్నారు.

## డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పన



డ్రోన్ వ్యవస్థను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

- పరిశీలించిన కలెక్టర్ రంజిత్‌బాషా

**కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** కర్నూలు ఐఐఐటీ డీఎం విద్యాసంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థ రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఐఐఐటీ డీఎం ఆధ్వర్యంలో రూపొందుతున్న డ్రోన్ ఆధారిత ఆరోగ్య పర్యవేక్షణ వ్యవస్థకు సంబంధించిన ప్రదర్శనను కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని తక్షణ వైద్యసదుపాయం అందించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. ఘటనా స్థలంలోనూ, ఆసుపత్రికి వెళ్తున్న సమయంలోనూ రోగుల పరిస్థితిని వైద్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేసి వైద్యసేవలు అందించేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ఈ వ్యవస్థ వైద్యులు, ఆసుపత్రుల మధ్య రియల్ టైం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పరుస్తుందన్నారు. అత్యవసర హెచ్చరికలు, గ్రీన్ చానల్ సమయంలో అంబులెన్సుకు రూట్ క్లియర్ చేసేందుకు కూడా ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.కృష్ణానాయక్, రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

**డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలి**

అన్నిశాఖల అధికారులు తమ కార్యాలయాలకు చెందిన డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో డాక్యుమెంటు అప్‌లోడు చేసే అంశంపై కలెక్టర్ జిల్లా అధికారులతో, తహసీల్దార్లతో, ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు తమ కార్యాలయాలకు సంబంధించిన చట్టాలు, నియమ నిబంధనలు, మెమోలు, జీవోలు సర్క్యులర్లు, ముఖ్యమైన డాక్యుమెంట్లు స్కానింగ్ చేసి ఈటీపీఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడు చేయాలన్నారు. రియల్ టైం గవర్నెన్స్‌లో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, అధికారులు మూడు రోజుల్లోపు డాక్యుమెంట్లు అప్‌లోడు పూర్తికావాలన్నారు. జేసీ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

## పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి

**బండిఆత్మకూరు, ఆగస్టు8(ఆంధ్రజ్యోతి):** మండలంలోని వరద రాజ స్వామి ఆలయ పాలక మండలి సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్‌గా సాంబరాజు జయదేవదత్త, సభ్యులుగా హైమావతి, నాగవేణమ్మ, స్వప్న, ఈరమ్మ, రంగస్వామి, నాగలింగం, శేఖర్, ఈరన్న ల చేత గ్రూప్ దేవస్థానాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి ప్రమాణం చే యించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్, సిబ్బంది నాగరాజు పాలక మండలి సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ప్రసాద్, కృష్ణనాయక్, భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు 'శాంతినికేతన్' విద్యార్థులు

**నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర స్థాయి జంప్ రోప్ పోటీలకు నంద్యాల శ్రీశాంతినికేతన్ విద్యార్థులు ఎంపికైనట్లు చైర్మన్ సుధాకర్ తెలిపారు. ఈనెల 5న పట్టణంలోని బాలాజి కాంప్లెక్స్‌లో ఉన్న శ్రీసంకల్ప్ పాఠశాలలో జిల్లా స్థాయి జంప్‌రోప్ జట్ల ఎంపిక జరిగిందన్నారు. తమ పాఠశాల విద్యార్థులు వై.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎం.రమేష్‌నాయక్, జి.సుధీర్, ఎస్.వలి, బి.అఖిలేష్‌కుమార్‌నాయక్, ఎం.లోకేష్‌నాయక్, కె.ఓబులేసు, ఎం.సుకుమార్, ఎస్‌మాబాష, పియశ్వంత్ నాయక్, ఎ.గురుతరుణ్, బి.కౌశిక్‌రెడ్డిలు జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 16, 17తేదీల్లో కావలిలో జరిగే రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

## గాజులపల్లి ప్రధాన రైల్వే గేట్‌లో సాంకేతిక లోపం

**మహానంది, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** గుంటూరు-గుంతకల్లు రైల్వే మార్గంలోని గాజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కాపలా ఉన్న రైల్వే గేట్‌కు సాంకేతిక లోపం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం గాజులపల్లి రైల్వే స్టేషన్ పరిధిలోని మహానంది- బోయలకుంట్ల రహదారిలో వెళ్ళే వాహనాల కోసం రైల్వేగేట్‌ను ఏర్పాటు చేసారు. అయితే గేట్‌కు ఉన్న కేబుల్ కట్ అవ్వడంతో సాంకేతిక సమస్య రావడంతో గేట్ పడింది. దీంతో అటువైపుగా వెళ్ళే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. దీంతో రెండు గంటల పాటు ట్రాపిక్ సమస్య ఏర్పడింది. చివరికి రైల్వే ఇంజనీరింగ్ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని గేట్‌కు మరమ్మతులు చేపట్టారు.దీంతో యధావిధిగా వాహనాలు ప్రయాణించాయి.

## 'టీడీపీకే బీసీలపై చిత్తశుద్ధి'



మాట్లాడుతున్న క్రాంతికుమార్ యాదవ్

**మహానంది, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** బీసీలపై టీడీపీకి మాత్రమే చిత్తశుద్ధి ఉందని తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతి కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం మహానంది సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మండల టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలను రెచ్చకొట్టే విధంగా వైసీపీ నాయకులు మాట్లాడి టీడీపీపై బురద జల్లే ప్రయత్నించడం దారుణమన్నారు. బీసీలపై దాడులుచేసి అక్రమ కేసులు బనాయించింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. పుంగనూరులో రామచంద్రయాదవ్ ఇంటిపై దాడి చేసింది మీరు కాదా అన్నారు. మహానంది మండలం లోని గోపవరం గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు బీసీలను టీడీపీ ప్రభుత్వంపై రెచ్చకొట్టే విధంగా గురువారం నంద్యాల్లో మా ట్లాడటం తగదన్నారు. మహానందిలో బార్బర్ షాపు నిర్వాహకుడు సుబ్బరాయుడు టీడీపీ కండువా కప్పుకొన్న పాపానికి అతని షాపును తొలగించే ప్రయత్నం చేయలేదా అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కంచర్ల శివశంకర్ చౌదరి, టీడీపీ నాయకులు గని చిన్నరంగస్వామి, సుదర్శన్‌రెడ్డి, రాముడు, గంగిశెట్టి మల్లిఖార్జున రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి బియ్యం వితరణ

**ఆత్మకూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్య క్రమానికి ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన సోంపల్లి ప్రసాద్ అనే భక్తుడు 25 బస్తాల బియ్యం ప్యాకెట్లను శుక్రవారం వితరణగా అంద జేశారు. ఈ సందర్భంగా దాత సోంపల్లి ప్రసాద్ మాట్లాడుతూ.. ఇక్కడ అన్నదాన కార్యక్రమం ఎంతో పద్ధతిగా జరుగుతుండటంతో బియ్యం అందజేశానన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు దాతలను శాలువాతో సత్కరించారు.

## మహానందిలో 'హర్ ఘర్ తిరంగ'పై ర్యాలీ




మహానందిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

**మహానంది, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మహానందిలో శుక్ర వారం హర్ ఘర్ తిరంగపై తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్ దౌలా ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహిం చారు. విద్యార్థులు జాతీయ జెండాను చేత పట్టుకొని ప్రతిజ్ఞ చేసారు. ఈవోఆర్డీ నాగేంద్రుడు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, ప్రధానోపాధ్యాయిడు సత్యాలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఈ వృద్ధురాలికి దిక్కెవ్వరు?



రేకుల షెడ్డులో నివాసముంటున్న పులిచర్ల బయమ్మ

**కొత్తపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** అడవుల్లో ఉంటూ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోని అడవి బిడ్డల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నామని చెబుతున్నారు. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎంతోమంది గిరిజన అభాగ్యులు కూడు, గూడు లేక, ఆదుకునేవారు లేక భిక్షాటన చేస్తున్న దృశ్యం కొత్తపల్లి మండలంలోని కపిలేశ్వరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... కొత్తపల్లి మండలం కపిలేశ్వరం గ్రామానికి చెందిన పులిచర్ల బయమ్మ అనే గిరిజన వృద్ధురాలికి పదేళ్ల క్రితమే భర్త మృతి చెందగా.. ఉన్న ఒక్కగానొక్క కూతురు కూడా అనారోగ్యంతో మృతి చెందింది. ఈమెకు స్థానికంగా ఓటు హక్కు ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులు గానీ, ఐటీడీఏ అధికారులు గానీ పట్టించుకునే పాపాన పోలేదు. గ్రామంలో ఉండడానికి సొంత గూడు లేకపోవడంతో గ్రామస్థులు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డులోనే కాలం వెల్లదీస్తోంది. కనీసం ఒంటరి మహిళ, వితంతు కింద పింఛన్ కూడా ఐటీడీఏ అధికారులు అందించలేకపోతున్నారు.

# వైభవం.. వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రత వేడుకలను నంద్యాల, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో అధిక సంఖ్యలో మహిళలు వ్రతంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. ఆధ్యాత్మిక శోభతో తొణికిసలాడాయి.



పాణ్యం: కొత్తూరులో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

**బండిఆత్మకూరు ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని 20 గ్రామాల్లో వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం వేకువజాముననే మహిళలు ఇళ్ల ముందు ముగ్గులు వేసి, గుమ్మాలకు మామిడి తోరణాలు, పూలమాలలతో అలంకరణలు చేశారు. అనంతరం ఇళ్లలో లక్ష్మీదేవి ప్రతిమలకు నైవేద్యాలు సమర్పించి పూజలు చేసి వ్రత కథలు విన్నారు. మహిళలు గ్రామాల్లో ఒకరికొకరు పుసుపు, కుంకుమ, ఫలాలు అందజేసుకున్నారు.



పాములపాడు: వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న జడ్పీటీసీ దంపతులు

**పాణ్యం:** మండలంలోని కొత్తూరు దేవస్థానంలో వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**పాములపాడు:** అమ్మవారి ఆలయాల్లో, ఇళ్లల్లో వరలక్ష్మి వ్రతాన్ని భక్తిశద్ధలతో జరుపుకున్నారు. చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి పురోహితులు కోదండరామయ్య శర్మ, కుంకు మార్చనలు నిర్వహించారు. తుమ్మలూరు గ్రామంలో జెడ్పీటీసీ దంపతులు జ్యోతి రామలింగేశ్వర్‌రెడ్డి దంపతులు అన్నదానం చేశారు.



మద్దిలేటి స్వామి ఆలయంలో..

**ఆత్మకూరు:** సంప్రదాయం ప్రకారం శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారాన్ని వరలక్ష్మీ వ్రతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పెద్దబజారులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, సుంకులమ్మ, శివాలయం, వీరాంజనేయస్వామి, అంబాభవానీ ఆలయాలు, తోటగేరిలోని చౌడేశ్వరీ, గంగాదేవి ఆలయాల్లో పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే దేవతామూర్తులకు నైవేద్యాలను సమర్పించి కుంకుమార్చనలు చేపట్టారు. ప్రత్యేకించి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కుంకుమార్చనలను నిర్వహించారు.

**నంద్యాల కల్చరల్:** నంద్యాల అమ్మవారిశాలలో, రామాలయంలో, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు, శ్రావణ శుక్రవారపు పూజలు నిర్వహించారు. అలాగే తెలుగుపేటలో వెలసిన ఘణమద్దులేటి స్వామి ఆలయం నందు శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారి కటాక్షం భక్తులందరికి వుండాలనే సంకల్పం, ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమానికి ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా వుండాలని లక్ష్మీకుబేర హోమం వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం అనంతరం తామరపూలు, తేనెతో లక్ష్మీకుబేర హోమం నిర్వహించారు. భక్తులు, ఆలయ నిర్వాహకులు మధుసూదన్ రాయల్ పాల్గొన్నారు.





బండిఆత్మకూరులో అమ్మవారికి పూజలు.. నంద్యాల: కాళికాంబ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు

## ఘనంగా గిరి ప్రదక్షిణ



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అధికారులు, అర్చకులు

**నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** శ్రీశైలక్షేత్రంలో స్వామి అమ్మవార్లకు మహామంగళహారతి అనంతరం గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ మహాద్వారం నుంచి గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నంది మండపం, బయలువీరభద్రస్వామి ఆలయం నుంచి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుని అక్కడి నుండి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం, మహిషాసురమర్దిని, రుద్రాక్షమఠం, విభూదిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగుస్తుంది.



కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

**వైభవంగా పల్లకీ సేవ:** శ్రీశైల క్షేత్రంలో శుక్రవారం మధ్యాహ్నం పౌర్ణమి సందర్భంగా స్వామి అమ్మవార్లకు వైభవంగా పల్లకీ ఉత్సవంనిర్వహించారు. అమ్మవారికి లక్షకుంకుమార్చన కార్యక్రమంతో పాటు సా యంత్రం లోకకళ్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వా ములు సేవా సంకల్పాన్ని పఠిస్తూ స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా, షోడశోపచార పూజ, ఊయలసేవ తదితరు కార్యకామాలు నిర్వహించారు.

**అంకాళమ్మకు పూజలు:** శ్రీశైల క్షేత్రంలో లోక కళ్యాణార్థం గ్రామదేవత అయిన అంకాళమ్మకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా కుడివైపు ఉత్తరముఖంగా అమ్మ వారికి అభిషేకం, అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చన నిర్వహించారు.

**సంప్రదాయ నృత్యప్రదర్శన**

శ్రీశైల క్షేత్రంలో నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గుంటూరు తిరుమల ఆర్ట్ అకాడమి విద్యార్థులచే సాంప్రదాయ నృ త్యప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మహాగణపతి, శివాష్టకం,శివస్తుతి, లింగాష్టకం, చంద్రశేఖరాష్టకం, శివపంచాక్షరి తదితర గీతాలకు, అష్టకాలకు గీతిక, భవ్య, భవ్యశ్రీ, తులసి, అక్షర, దుర్గ, లీల నృత్యప్రదర్శన చేశారు.

## ఓటర్ల సమగ్ర సవరణ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం




నంద్యాలలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

**నంద్యాల, రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గాంధీచౌక్‌లో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన పద్ధతి పౌరుల ఓటు హక్కును ప్రశ్నించే విధంగా ఉందన్నారు. వెంకట లింగం, తోట మద్దులు, నరసింహ, గౌస్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

**నందికొట్కూరు:** కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయ లబ్ధిపొందాలని చూస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. శుక్రవారం పటేల్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో పక్కీర్ సాహెబ్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో ఎన్డీఏ ప్రభుత్వం జాతీయ పౌరసత్వ రిజిస్టర్(ఎన్‌సిఆర్) పౌరసత్వ చట్ట సవరణ)సిఏఏ)తీసుకొచ్చి దళితులు, మైనార్టీలు, వలస కార్మికుల ఓట్లను తొలగించాలని ప్రయత్నం చేసిందన్నారు. సీపీఎం ప్రజాసంఘాల నాయకులు గోపాలకృష్ణ, కర్ణ పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** బీహార్ రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్)తో ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని సీపీఎం నాయకులు రణధీర్, సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీహార్‌లో ఎస్ఐఆర్ ద్వారా ఓటరు తాను భారత పౌరుడేనని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఓటర్లపై ఉంచడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఓటర్ల నమోదుకు పౌరసత్వంతో ముడిపెట్టడం సరికాదన్నారు. సురేంద్ర, వీరన్న, శివకుమార్, నూర్, రవి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల మధ్య ప్రమాదకరంగా తొట్టి నిర్మాణం



ఆలమూరు ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న పశువుల తాగునీటి తొట్టి

**పాణ్యం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** నిత్యం పశువుల గుంపులుండే చోట నిర్మించాల్సిన పశువుల తాగునీటి తొట్టిని ఏకంగా ఇళ్లనివాసాల మధ్య నిర్మిస్తున్నారు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం కింద గ్రామాలలో పశువుల తాగునీటికై పశువుల తాగానీటి తొట్లు ఏర్పాటు చేయడానికి డ్వామా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. కాగా పశువులు రద్దీ గాఉండే ప్రాంతాలలో ప్రభుత్వ స్థలంలో తొట్లు ఏర్పాటుచేయాలని పంచాయతీరాజ్ శాఖను ఆదేశించారు. దీంతో పశువుల మందలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో తొట్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా పాణ్యం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఏకంగా దళితులు జననివాసాల మధ్య ఏర్పాటు చేస్తుండడంతో ఆప్రాంత దళితులు నీటి తొట్టి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ తొట్టి ప్రాంతంలో ఎక్కువగా చిన్నపిల్లలు, విద్యార్థులు ఆటలాడుకుంటుంటారని నీటి తొట్టి పిల్లలకు ప్రమాదకరంగా మారుతుందని ఆరోపిస్తున్నారు. అలాగే ఈప్రాంతంలో పశువుల మందలు ఉండకపోవడంతో ఈనీటి తొట్టి నిరుపయోగంగా మారి ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుందని పేర్కొంటు న్నారు. గతంలో నీటి తొట్టిని వ్యతిరేకించడంతో తొట్టి నిర్మాణాన్ని నిలిపివేశారని పేర్కొంటున్నారు. ప్రమాదం జరగక ముందే తొట్టి నిర్మాణాన్ని నిలిపివేసి పశువులు ఎక్కువగా ఉండే ప్రాంతంలో నిర్మించాలని కోరుతున్నారు.

## పుణ్యక్షేత్రాలకు వెళ్లే దారిలా..



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఎం.లింగాపురం రహదారి. ఈ రహదారిపై నిత్యం ఆత్మకూరు పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు 20 గ్రామాల జనం రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే కొలనుభారతి, సంగమేశ్వరానికి, ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం ఈదారి గుండానే వెళ్లాలి. రోడ్డు పూర్తిగా గుంతలమయమై ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. డ్రైనేజీతో పాటు బావుల నీరు రోడ్డుపై నిత్యం ప్రవహిస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికా రులు, ప్రజాప్రతినిధులు నిత్యం ఈ రహదారి గుండా వెళ్తున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా స్పందించి సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు. ● కొత్తపల్లి, (ఆంధ్రజ్యోతి)

## పట్టుదలతో చదివితేనే లక్ష్యం సాధ్యం



సీఐలను సన్మానిస్తున్న దృశ్యం

**నందికొట్కూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** కృషి, పట్టుదలతో చదివితే లక్ష్యం సాధ్యమని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో విజ్ఞాన్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి నందికొట్కూరు రూరల్, టౌన్ సీఐలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అనంతరం కళాశాల టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్, షీల్డులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల యాజమాన్యం గాంధీనాయుడు, వినోద్ కుమార్, అధ్యాపక బృందం ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నంద్యాల కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** నంద్యాల డి2 సెక్షన్ పరిధిలో శనివారం సందర్భంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పవర్ కట్ ఉం టుందని విద్యుత్ ఏఈ రామయ్య తెలిపారు. లైన్‌మెయింటెనెన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ మెయింటెనెన్స్ కారణంగా సరఫరా ఉం డదని తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

## పగిడ్యాలలో 24.6 మి.మీ వర్షపాతం

**పగిడ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని దిదిత గ్రామాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. గత కొద్దిరోజుల నుంచి వర్షాలు కురవకపోవడం, ఎండ తీవ్రతతో మెట్ట పొలాలలో రైతులు సాగు చేసిన పంటలు ఎండుదశకు చేరుకోవడంతో రైతులు వర్షం కోసం ఎదురిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి కురిసిన వర్షనికి రైతుల ఆనదం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షం కురుస్తే పంటలకు బాగా ఉంటుందని తెలిపారు. పగిడ్యాలలో 24.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## ప్రాణాలు పోయేదాకా పట్టించుకోరా...?

- కొత్త స్తంభం ఏర్పాటు చేశారు
- పాతది తొలగించడం మరిచారు
- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



నెహ్రూనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

**పగిడ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** దేనితోనైనా ఎంతో కొంత నిర్లక్ష్యంగా ఉండొచ్చేమోగాని కరెంటుతో మాత్రం ఒళ్లంతా కళ్లుపెట్టుకుని ఉండాల్సిందేనని పలువురు హెచ్చరిస్తుండటం మనం వింటూ ఉంటాం. మరి ఇది అక్షరాలా నిజమే కదా.. కానీ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించక పోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. పగిడ్యాల మండల పరిధిలోని నెహ్రూనగర్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. కొన్నేళ్ల కిందట ఈ విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేయడంతో సిమెంట్, కంకర ఊడిపోవడంతో ఇనుప కడ్డీలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారింది. దీంతో సంబంధిత అధికారులు నెల కిందట శిథిలావస్థకు చేరుకున్న స్తంభం సమీపంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను లాగారు. అయితే కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ స్తంభాన్ని మాత్రం మార్చక పోగా, ఆ స్తంభానికే విద్యుత్ బల్బు, తీగలు వదిలివేశారు. దీంతో చిన్నపాటి గాలి వీచినా శిథిలావస్థకు చేరుకున్న ఆ స్తంభం కూలిపోయే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో ఆ దారిన నిత్యం జనం తిరుగుతుంటారు. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని ప్రమాదకరంగా స్తంభం ఉండటంతో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేసిన అధికారులు మాత్రం పాతది తొలగించకపోవడంపై అధికా రుల నిర్లక్ష్యంపై మండిపడుతున్నారు. ప్రమాదం జరగకముందే దెబ్బతిన్న ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

# వైభవంగా వరలక్ష్మీ వ్రతం


బనగానపల్లె : మంత్రి నివాసంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మంత్రి దంపతులు


వెల్లాల క్షేత్రంలో వరలక్ష్మీవ్రతం చేస్తున్న వేద పండితులు


రుద్రవరంలో..


కొలిమిగుండ్ల: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జిల్లాలో వరలక్ష్మీ వత్ర పూజలు మహిళలు ఘనంగా నిర్వహించారు. బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు వారి నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సకల శుభాలను అష్టైశ్వర్యాలను, సుఖ సంతోషాలను, ఆయు రారోగ్యాలను ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నారు. తెల్లవారుజామున నుంచే మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




కోవెలకుంట్లలో...


దొర్నిపాడులో పూజలు చేస్తున్న భక్తులు


చాగలమర్రిలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న దంపతులు, వేద పండితులు


నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు


ప్యాపిలి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


మద్దిలేటి స్వామి క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న వేద పండితులు


డోన్: దుర్గమ్మ ఆలయంలో...

## ఓటర్ల జాబితా సమగ్ర సవరణ తగదు



డోన్‌లో మాట్లాడుతున్న నక్కి శ్రీకాంత్

**డోన్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, పట్టణ కమిటీ సభ్యులు శివరాం, ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం, డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు నక్కి హరి, హరీఫ్ బాషా అన్నారు. ఈ మేరకు పట్టణంలోని బేతంచెర్ల సర్కిల్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదం ఏర్పడు తుందన్నారు. ఎన్నికల సంఘం అమలులోకి తీసుకువస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.
**బేతంచెర్ల:** బీహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్నికల పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర ప్రమాదమని, పౌరుల ఓటు హక్కును ప్రశ్నించి నిబంధనలు ఇందులో ఉన్నాయనీ సీపీఎం సీనియర్ నాయకులు ఎల్లయ్య, మండల కార్యదర్శి మధుశేఖర్ ఆరోపించారు. శుక్రవారం ఎన్‌ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పట్టణంలోని పాత బస్టాండులో సీపీఎం నాయకులు సంజీవ నాయుడు, రామాంజనేయులు ఆధ్వర్యంలో నిరసన చేశారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి స్వామి, ఖాజాబాషా, రామాంజనేయులు, మధుబాబు, రామకృష్ణ, రాజు, జలందర్, హరికృష్ణ, శ్రీను, ప్రసాద్, శంకర్, కాశన్న మాలిక్ పాల్గొన్నారు.

## నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం

**డోన్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** డోన్ పట్టణం ఆంజనేయ స్వామి కొండపై శనివారం భూదేవి శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు మాణిక్య ప్రభు సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ మహోత్సవానికి భక్తులు తరలిరావాలని కోరారు.

## 12న జాబ్ మేళా

**కోవెలకుంట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు జీఆర్ ఇన్‌స్ట్రాకెమ్ లిమిటెడ్, హెట్రోల్యాబ్, పెన్నార్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్, డిక్సన్, ముత్తూట్‌ఫైనాన్స్ లిమిటెడ్ తదితర పది ప్రైవేటు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పాల్గొనేందుకు పదోతరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీ.డీ.ఎం ఫార్మశీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్.8688651650, 9705998056లను సంప్రదించాలని తెలిపారు.

## 12న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** చిన్నారుల్లో, బాల బాలికల్లో రక్తహీనత, తీవ్ర పోషకాహార లోపాన్ని కలిగించే నులిపురుగుల నివారణ కోసం 12న ఆయా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు మింగించనున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి ఇమ్రాన్, అంజలి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ 1 నుంచి 2 సంవత్సరాలు, 5 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరూ ఆల్బెండజోల్ మాత్రలు తప్పక తీసుకునేలా చూడాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ కూటమి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వార రుణాలు మంజూరు చేయాలని అన్నారు. బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నామని అయితే ఇంతవరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయలేదని అన్నారు. పాలకులు, అధికారులు స్పందించి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, చిన్నికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు యూరియా విక్రయం

● ఆందోళనలో రైతులు

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో అధిక ధరలకు ఎరువులను డీలర్లు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కొరతను సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారని వాపోతున్నారు. యూరియా బస్తా ధర రూ.266.50 అయితే డీలర్లు రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర ఎరువులు కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారని, ఈ విషయం గురించి వ్యవసాయాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎరువులను అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ప్రపంచ శాంతికోసం పాదయాత్ర


చాగలమర్రిలో పాదయాత్ర చేస్తున్న తెలంగాణ వాసులు

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** ప్రపంచ శాంతికోసం పాదయాత్ర చేపట్టినట్లు వెంకటేశ్వర భక్త బృందం అధ్యక్షుడు సీసాల రాజు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు నుంచి తిరుమలకు 25 మంది మహా పాదయాత్రగా వెళ్తూ శుక్రవారం చాగలమర్రిలోని గ్రామ దేవత చాగలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీసాల రాజు మాట్లాడుతూ గత నెల 29 నుంచి పాదయాత్ర ప్రారంభించామని అన్నారు. ఈనెల 13న తిరుమలకు చేరుకొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని పాదయాత్ర ముగిస్తామని అన్నారు. ప్రజలు శాంతియు తంగా ఉండాలని, వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండాలని కోరుకుంటూ పాదయాత్ర చేస్తున్నామని అన్నారు.

## పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి


చాగలమర్రిలో ఏడాది సుపరిపాలన పత్రాలతో అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేస్తోందని నంద్యాల బీసీసెల్ స్పోక్‌పర్సన్ టైలర్‌బాషా, మండల దూదెకుల సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని 211 బూత్‌లో ఏడాది సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్-6 కరపత్రాలతో ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ నాయకులు పీరయ్య, సుబ్బరాయుడు, ఓబులేసు, దస్తగిరి, బాషా పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి : మంత్రి బీసీ


ఏర్పాట్లపై నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బీసీ

**బనగానపల్లె, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** బనగానపల్లె , కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్‌చైర్మన్, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం బనగానపల్లె మార్కెట్‌యార్డులో 11న నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఏర్పాట్లను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్‌గా కాట్రెడ్డి మల్లిఖార్జునరెడ్డి, ఇతర పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని నాయకులకు సూచించారు. ప్రజలు, రైతులు, పార్టీనేతలు, కార్యకర్తలు వస్తుండడంతో వారికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, భూషన్న, మురళీమోహన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలనాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే గ్రామాభివృద్ధి

**డోన్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు చింతలపేట వెంకట్రాముడు, క్లస్టర్ ఇన్‌చార్జి అశోక్, బూత్ ఇన్‌చార్జి అక్బర్‌బాషా అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అభిరెడ్డిపల్లె గ్రామంలో సుపరిపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో తాడూరు బూత్ ఇన్‌చార్జి వీరాంజనేయులు, మిద్దెపల్లె బూత్ ఇన్‌చార్జి సుధాకర్, ఐటీడీపీ మిద్దెపల్లి రవి, బూత్ ఇన్‌చార్జి శ్రీనివాసులు గౌడు పాల్గొన్నారు.

## గెలుపోటములను సమానంగా తీసుకోవాలి


పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

**డోన్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్రికే ఫణిరాజ్, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, పీఏసీ చైర్మన్ చిన్న పూజర్ల ఎల్లాగౌడు అన్నారు. శుక్రవారం పట్టణం సమీపాన ఉన్న వెంకటనాయునిపల్లె సమీపంలో ఉన్న వెంకటేశ్వర ఐటీఐ రోడ్డు సమీపంలో నిర్వహించిన ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని రైల్వే సుభాన్, కోట్ల యూత్ అజీజ్ ఆధ్వర్యంలో ఈ క్రికెట్ పోటీలను ఏర్పాటు చేశారు. ప్రథమ విజేతకు రూ.10,016, ద్వితీయ విజేతకు రూ.5,016 అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓంప్రకాష్, రవి, కమల్ బాద్‌షా, టీడీపీ యువ నాయకుడు మధు, జావీదు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**డోన్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం సరఫరాలో అంతరాయం ఉంటుందని విధిస్తున్నట్లు విద్యుత్ ఈఈ నాగేంద్ర, నాగేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తబస్టాండు మీదుగా మహాలక్ష్మి హాస్పిటల్, పండరినగర్, కృష్ణానగర్, కురుకుందు నగర్, కొత్తపేట, పాతపేట, కొండపేట ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తబస్టాండు మాధన్న నగర్, శ్రీనివాసనగర్, ఆటోనగర్, ఇందిరానగర్, తారకరామ నగర్, సుందర్‌సింగ్ కాలనీ, పాతబస్టాండు, కంబలపాడు రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గం టల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే రెండు రోజుల పాటు శనివారం, ఆదివారం మండలంలోని దేవరబండ సబ్ స్టేషన్ పరిధిలో మిద్దెపల్లె ఫీడర్ కింద ఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో 11 కేవీ పనులు జరుగుతుండడంతో మిద్దెపల్లె, అనుంపల్లి, రేగుల కుంట గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే త్రీ ఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అందించనున్నట్లు తెలిపారు.

## శ్రీకృష్ణదేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలి


శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

**బేతంచెర్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** విజయనగర సామ్రాజ్య వ్యవస్థాపకులు శ్రీకృష్ణదేవరాయలు సుపరిపాలన నేటి పాలకులు ఆదర్శంగా తీసుకోవాలని కాపు బలిజ సంఘం నాయకులు నాగమోహన్, హరిశ్చంద్ర, గాజుల హరికృష్ణ, కూరాకుల వెంకట్రాముడు, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బేతంచెర్లలోని పాతబస్టాండులో శ్రీకృష్ణదేవరాయల 516వ పట్టాభిషేక మహోత్సవాన్ని బలిజ సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రుద్రవరం కృష్ణుడు, మధు, సాయి, శేషు పాల్గొన్నారు.

## వీరజవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం


పెద్దవంగలిలో జవాన్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**చాగలమర్రి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన వీరజవాన్ అశోక్‌కుమార్ గత నెల 28న శ్రీనగర్‌లో విధుల్లో ఉండగా గుండెపోటుతో మృతిచెందారు. కర్నూలు జిల్లాకు చెందిన జైజవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, ఉపాధ్యక్షులు షేక్. మాబుషరీఫ్ ఆధ్వర్యంలో రూ.1.05 లక్షల ఆర్థికసాయం చెక్కును జవాన్ కుటుంబ సభ్యులకు అందజేశారు. జైజవాన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జవాన్ కుటుంబాన్ని ఓదార్చి వారిలో మనోధైర్యం నింపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ్ కుమార్, సహాయ కార్యదర్శి అంజి, కోశాధికారి డీఆర్ రెడ్డి, ఈసీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని రక్షించుకుందాం


మొక్క నాటుతున్న విద్యార్థినులు

**డోన్ టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని స్ఫూర్తి సేవా సమితి సభ్యులు మధు, భాస్కర్, వసంత్, ఫిజికల్ డైరెక్టర్ మోహన్‌గౌడు అన్నారు. శుక్రవారం గుత్తిరోడ్డులోని మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాలలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి సేవా సమితి సభ్యులు హుశేన్, తెలుగు విజయ్, రాజశేఖర్, పాతపేట వెంకటేశ్, ఖయూమ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో బస్‌షెల్టరు


పిచ్చిమొక్కలతో నిండిపోయిన బస్‌షెల్టర్

**రుద్రవరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని హాటీనగరం మెట్ట వద్ద ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరిం ది. బస్‌షెల్టర్ పైకప్పు లేకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. 20 ఏళ్ల కిందటఫారెస్టు శాఖ అధికారులు బస్‌షెల్టరు నిర్మించారు. వర్షాలకు పైకప్పు కూలిపోయింది. అప్పటి నుంచి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రజలు ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌షెల్టర్‌కు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకరావాలని ప్రజలు కోరుతున్నారు.

## స్మార్ట్ మీటర్లతో సామాన్యులకు ఇబ్బందులు



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

**ఆళ్లగడ్డ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** స్మార్ట్ మీటర్లతో సామాన్యుల నడ్డి విరవద్దని ఆళ్లగడ్డ జేఏసీ నాయకులు బీరువాల బాషా తెలిపారు. శుక్రవారం పట్టణం లోని జేఏసీ కార్యాలయంలో ప్రజా, కుల, హక్కుల సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తెస్తుందని గగ్గోలు పెట్టిన కూటమి ప్రభుత్వం నేడు స్మార్ట్ మీటర్లు అనుమతి ఇవ్వాలని చూస్తుందని విమర్శించారు. దేశంలో అదాని, అంబానీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేవలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సిఐటీయు జిల్లా జాయింట్ కార్యదర్శి శ్రీనివాసులు, న్యాయవాదులువలి, గౌస్, హ్యూమన్ రైట్స్ నాయకులు పెద్దన్న, ఓబన్న, నూర్ బాషా, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి


ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి దంపతులు

**శిరివెళ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని బోయలకుంట్ల వ్యవసాయ సహకార సంఘం బలోపేతానికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని టీడీపీ శిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఆయన భార్య కాటంరెడ్డి అరుణ అన్నారు. బోయలకుంట్ల సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్‌గా కాటంరెడ్డి అరుణను ఎంపిక చేయడంతో వారు ఆళ్లగడ్డలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, యువ నాయకులు భార్గవ్‌రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. భూమా కుటుంబం తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని రైతుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు అన్నారు.

## మంత్రిని కలిసిన మార్కెట్ యార్డు చైర్మన్


మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లయ్య దంపతులు

**ఆళ్లగడ్డ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):** ఆళ్లగడ్డ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త మలయ్య, ఆయన సతీమణి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సురేఖ మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం కలుసుకొన్నారు. ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా సురేఖను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌కు శాలువ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. అలాగే శాసన మండలి సభ్యులు పిడుగు అహరి ప్రసాద్, పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## చర్చిని తొలగించాలి


మాట్లాడుతున్న హిందూ సంఘాల నాయకులు

**కొలిమిగుండ్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :** యజమాని అనుమతి లేకుండా రాఘవరాజుపల్లె గ్రామంలో ఏర్పాటు చేసుకున్న చర్చిని తొలగించాలని హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు చర్చి స్థలాన్ని పరిశీలించారు. గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి గతంలో చర్చి కోసం లీజుకు ఇచ్చారని, అయితే లీజు గడువు ముగియడంతో విశ్వనాథరెడ్డి చర్చిని తీసివేయాలని కోరుతున్నారు. విశ్వనాథరెడ్డి నిర్ణయం మేరకు దీంతో విశ్వహిందూ పరిషత్ చంద్రశేఖరరెడ్డి, రాముడు, సామరస్యత సభ్యులు చర్చి తొలగించాలని తీర్మానం చేశారు.